

# అవకాశం

మల్లిక్

సూర్యనారాయణ చెప్తున్న మాటలు విని నేను చాల ఆశ్చర్యపోయాను. రాఘవరావు అటువంటి మనిషి కాదే?.... మరి సూర్యనారాయణ వాడి గురించి ఇలా ఎందుకు చెప్తున్నట్టు? సూర్యనారాయణ చెప్పే మాటలు నాకు ఒకపట్టున నమ్మబుద్ధి కాలేదు.

రాఘవరావు చాల మంచివాడు. అతనికి ఎన్నోరకాల ఆదర్శాలవీకూడా ఉన్నాయి. అవినీతిని అసలు సహించలేడు. అంతెందుకూ?.... సినిమా టికెట్లు బ్లాకులో కొన్నందుకు ఒకసారి తన స్నేహితుడు విశ్వంతో కయ్యంపెట్టుకున్నాడు. అటువంటి తప్పుడుపని చేసేవాళ్ళకన్నా వాళ్లను ప్రోత్సహించేవాళ్లదే మహానేరం అన్నాడు.

ఆ మరునాడు "రాఘవరావుకి బ్లాకులో సినిమా టిక్కెట్టుకొనే తాహతు లేదు గురూ.... అదీ వాడి ఏడుపు" అని విశ్వం నాతో అన్నాడనుకోండి.... అది వేరే విషయం.

మా ఆఫీసులోనే చలపతి, వీరభద్రం పనిచేస్తున్నారు. వాళ్ల పొడంటేనే రాఘవరావుకు గిట్టదు. వాళ్లు ఎదురుగావస్తే అటుప్రక్కకి దూరంగా జరిగి తప్పించుకుని వెళ్లిపోతుంటాడు. వాళ్లెప్పుడైనా పలకరిస్తే అవసరానికి మించి ఒక్క అక్షరమైనా వాళ్లతో మాట్లాడడు రాఘవరావు.

రాఘవరావు మాటల్నిబట్టి అతనికి చలపతన్నా, వీరభద్రం అన్నా చాల అసహ్యం అని అర్థంఅయింది నాకు. అందుకు కారణం వాళ్లు లంచాలు విరివిగా తినడమే. వాళ్లతో పనుండేవాళ్లు వట్టి చేతులతో వెళ్లనే వెళ్లకూడదు. లంచం తీసుకోవడం నీచంగా భావిస్తాడు రాఘవరావు.

"మనం ఆఫీసులో పనిచేస్తున్నందుకు ప్రభుత్వం మనకి జీతం ఇస్తుంది.... అలాంటప్పుడు మనపని మనం చేస్తున్నప్పుడు పరాయివాళ్ల దగ్గరనుండి లంచం తీసుకోవడం తప్పుకాదూ?...." అని రాఘవరావు చాలసార్లు నాతో అన్నాడు.

అటువంటి రాఘవరావు లంచాలు తింటున్నాడంటే ఎలా నమ్మను?.... అదే సూర్యనారాయణతో అన్నాను.

"ఆ.... పోదూ.... అవకాశం లేనప్పుడు అందరూ ఈర్ష్యతో అలానే అంటారు. అప్పుడు అతనిది ఏమంత మంచి సీటుకాదు. అదీ ఏడుపు. ఇప్పుడు సీటు మారాడుగా. ఇప్పుడతను పని చేస్తున్న సీటు మంచి రాబడి ఉన్న సీటులే" అన్నాడు సూర్యనారాయణ.

సూర్యనారాయణ చెప్పిన విషయాన్ని ఖండించలేకపోయాను.

నిజంగా రాఘవరావు లంచాలు తినడం మొదలుబెట్టాడా?.... అంటే ఇన్నాళ్లూ అతనికి కేవలం అవకాశం లేకనే....

నేను ఆలోచిస్తున్నాను.

---